నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, మంగళవారం 20 మే 2025 | HANUMAKONDA

# రైతన్నపై విత్తన పిడుగు

- భారీగా పెరిగిన జీలుగ విత్తన ధరలు
- వానాకాలంకు ముందే పెంచిన ప్రభుత్వం
- అన్నదాతను నిండా ముంచుతున్న కాంగ్రెస్ సర్కారు

*రైతు ప్రభుత్వమని చెప్పుకొంటున్న కాంగ్రెస్.. రైతులను అదును చూసి దెబ్బ కొడుతున్నది. ఇప్పటికే పథకాల అమలులో అనేక కొర్రీలు పెడుతున్న రేవంత్‌రెడ్డి సర్కారు.. తాజాగా జీలుగ విత్తన ధరలు పెంచి మరో పిడుగు వేసింది. ఏకంగా రెండింతలు ధర పెంచేసి రైతులపై మోయలేని భారం వేసింది. రైతులు ఏటా భూమి సారవంతానికి, పంట దిగుబడి కోసం పొలాల్లో జీలుగ విత్తనాలను చల్లుకొని ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్ని ఎరువుగా మార్చి నేలను సాగు కోసం సిద్ధం చేసుకుంటారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30కిలోల బస్తా కేవలం రూ.1124కే అందించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4,275లకు పెంచి సబ్సిడీపై రూ.2137లకు అందిస్తూ రైతులపై ఆర్థిక భారం మోపుతున్నది. మొన్నటిదాకా సాగు నీటి కోసం అష్టకష్టాలు పడి పంటలు పండిస్తే ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనక వరద పాలై ఆగమయ్యామని. ఇప్పుడు మళ్లీ జీలుగ విత్తన ధర పెంచి నిండాముంచుతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.*

*- పెద్దవంగర/నల్లబెల్లి, మే 19*



### రెండింతలైన ధర

ఆరుగాలం కష్టపడే రైతులపై కాంగ్రెస్ సర్కార్ చిన్న చూపే చూస్తున్నది. ఇప్పటికే సాగును భారంగా మార్చిన ప్రభుత్వం జీలుగు విత్తన ధరలు పెంచి వారిపై ఆర్థికంగా కుంగదీస్తున్నది. 30 కిలోల బస్తా ధర సుమారు రెండింతలు పెంచడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే భారీగా ధరలు పెంచడంపై మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు అన్ని పథకాలకు రైతులను దూరం చేసింది. రైతుభరోసా, రుణమాఫీ సహా ఏ పథకాన్ని కూడా సంపూర్ణంగా అందరికీ అందించలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడు ధర ఒక్కసారిగా పెంచడంపై పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం సరఫరా చేసే జీలుగ విత్తనాల సంచిలో సగం వరకు పుచ్చులు ఉంటాయని పలువురు వాపోయారు. జీలుగ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. గత ఏడాది మాదిరిగానే 30 కిలోల బస్తాను పాత ధరకే అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ సర్కారు స్పందించకపోతే అన్నదాతల ఆగ్రహం ఏ విధంగా ఉంటుందో చూపిస్తామని తెగేసి చెబుతున్నారు. అన్నదాతను ఆదుకుంటామని గొప్పలు చెప్పే కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా జీలుగు విత్తనాల ధరను తగ్గించాలని కోరుతున్నారు. జీలుగ విత్తనాల ధర పెంచిన ప్రభుత్వం సొసైటీలు, అగ్రోస్ కేంద్రాల ద్వారా అన్నదాతలకు సబ్సిడీపై అందిస్తున్నారు. 30 కిలోల జీలుగు విత్తనాల ధర రూ.4275 రూపాయలుగా నిర్ణయించారు. 50శాతం సబ్సిడీపై రైతులకు రూ. రూ.2137.50 రూపాయలకు అందజేస్తున్నది. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్‌ను సొసైటీ కార్యాలయాల్లో చూపించి సబ్సిడీపై విత్తనాలను తీసుకోవాలని అధికారులు సూచించారు.

#### ప్రజాపాలనలో పచ్చిరొట్ట సాగు ప్రశ్నార్థకమేనా?



ప్రజాపాలనలో పచ్చిరొట్ట సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వాలు నకిలీ మందులకు అనుమతులు ఇవ్వడంతో భూసారం దెబ్బతిని దిగుబడులు రాక తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. అలాగే కాంగ్రెస్ వచ్చాక దిగుబడులు తగ్గినప్పటికీ పండిన పంటకు సైతం ఆశించిన ధర లేదు. మిరప(తేజ) పంటకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్వింటాకు రూ.22వేలు పలికితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఇదే క్వింటాకు రూ.7వేల నుంచి 8వేలు ధరకే పరిమితమైంది. పంట పెట్టుబడితో పాటు కూలీలకు చెల్లిస్తున్న డబ్బులతో నేడు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం పునరాలోచించి జీలుగ విత్తనాల ధరను తగ్గించి పంటలకు గిట్టుబాటు ధర అందించాలి.

*– నాగంపల్లి కిరణ్‌కుమార్, చపాటా మిర్చి రైతు, రేలకుంట, నల్లబెల్లి మండలం*

#### ఇంత ధరైతే కొనుడెట్లు?



జీలుగ విత్తనాల ధరను ఇంత పెద్ద మొత్తంలో పెంచడం సరైనది కాదు. ఇది రైతులపై ఆర్థిక భారం మోపడమే. అంత ధర పెట్టి రైతులు ఎలా కొంటారు. ప్రభుత్వం మరోసారి ఆలోచించాలి. ధరను అందుబాటులోకి తీసుకురావాలి.

*– దేశబోయిన రాజు, కొరిపెల్లి గ్రామ యువ రైతు, పెద్దవంగర*

#### ఎందుకంత పెంచినట్లు?



విత్తన ధరను పెంచి రైతులపై భారం మోపింది. ఇప్పటికే ఖర్చులు తడిసి మోపెడవుతుంటే ప్రభుత్వం జీలుగ విత్తనాల ధర పెంచి రైతులపై మరో పిడుగు వేసింది. ఇది కచ్చితంగా రైతులను మోసం చేయడమే. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

*– రెడ్డబోయిన గంగాధర్ యాదవ్, పెద్దవంగర*



కార్పొరేటర్ గుండేటి నరేందర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు

# తూర్పు కాంగ్రెస్‌లో కక్షా రాజకీయం

## సొంత పార్టీ వారినే పోలీస్ కేసులతో టార్గెట్

- గుండేటి నరేందర్ ఘటనతో నాయకుల్లో వణుకు
- మామునూరు ఏసీపీకి కార్పొరేటర్ కేసు విచారణ బాధ్యతలు .. నరేందర్‌కు పరామర్శల వెల్లువ

*వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో కక్షా రాజకీయం ఊపందుకున్నది. మాట వినని నాయకులను ఓ వర్గం పోలీస్ కేసులతో టార్గెట్ చేస్తున్నది. నయానో భయానో దారికి తెచ్చుకునేందుకు పోలీస్ వ్యవస్థను వాడుకుంటున్నది. స్వపక్ష నాయకులపైనే కేసులు పెట్టడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై పోలీసులు కేసులు పెట్టడం కలకలం సృష్టించింది. కార్పొరేటర్ స్థాయి నాయకుడిపైనే కేసులు పెట్టి వేధిస్తుంటే కిందిస్థాయి కార్యకర్తల పరిస్థితి ఏంటని జోరుగా చర్చ జరుగుతున్నది. ఈ వ్యవహారంపై సీనియర్ నాయకులు సైతం పెదవి విప్పకపోవడం ఓ వర్గం పెత్తనం ప స్థాయిలో ఉన్నదో అవగతమవుతున్నది.* *- వరంగల్, మే 19*

మాట వినని నాయకులను కాంగ్రెస్‌లోని ఓ వర్గం వేధిస్తున్నది. పోలీస్ కేసులతో టార్గెట్ చేస్తున్నది. సొంత శిబిరం నుంచి ప్రత్యర్థి శిబిరంలోకి వెళ్లిన కార్పొరేటర్ గుండేటి నరేందర్‌ను టార్గెట్ చేసి లైంగిక దాడికి యత్నం కేసుతో పాటుగా అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో పోలీస్ కేసుల భయం పట్టుకుంది. ఏ రోజు ఎవరిని టార్గెట్ చేస్తారోనన్న ఆందోళన నెలకొంది. పార్టీలో వన్ మ్యాన్ షో జరుగుతుందని సొంత పార్టీ నాయకులే చెబుతున్నారు. తమను రక్షించే వారెవరంటూ ఆవేదన చెందుతున్నారు. తూర్పు కాంగ్రెస్‌లో సరికొత్త సంస్కృతితో పాతతరం నాయకులు ఇమడలేక పోతున్నారు.

### నరేందర్ కేసు మామునూరు ఏసీపీకి అప్పగింత

కార్పొరేటర్ గుండేటి నరేందర్ కేసు విచారణ బాధ్యతలను మామునూరు ఏసీపీ తిరుపతికి అప్పగించారు. కేసు విచారణను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ నుంచి తప్పించడం చర్చనీయాంశంగా మారింది. తూర్పు కాంగ్రెస్‌లోని ఒక వర్గానికి నందిరాంనాయక్ కొమ్ము కాస్తున్నాడనే ఆరోపణల నేపథ్యంలోనే కేసును ఆయన నుంచి తప్పించినట్లు చర్చ సాగుతున్నది. ఏసీపీ తిరుపతి కేసు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫిర్యాదు చేసిన నమిండ్ల లావణ్యను మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో విచారించారు. కాగా, అధికార పార్టీ కార్పొరేటర్‌పై మహిళ 100కు ఫిర్యాదు చేయడం, వెంటవెంటనే అదుపులోకి తీసుకోవడం, కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో పోలీసులు వేగంగా స్పందించిన తీరు పలు అనుమానాలకు తావిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

### పరామర్శల వెల్లువ

కార్పొరేటర్ గుండేటి నరేందర్‌కు పరామర్శలు వెల్లువెత్తాయి. అన్యాయంగా అక్రమ కేసులు నమోదు చేశారని పార్టీలకతీతంగా సానుభూతి వ్యక్తమవుతున్నది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నరేందర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లామని, భయపడాల్సింది ఏమీ లేదని అభయమిచ్చా రు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, పద్మశాలి కుల సంఘం నాయకులు ఆయనను పరామర్శించారు.

## నేడు ఓరుగల్లుకు కాకతీయ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్



హనుమకొండ, మే 19 : కాకతీయ వంశ 22వ వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ కాకతీయ మంగళవారం ఉదయం వరంగల్ నగరాన్ని సందర్శించనున్నట్లు టార్చ్ కార్యదర్శి అరవింద్ ఆర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయన భద్రకాళీ ఆలయ, వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట లాంటి కాకతీయుల ఘన వారసత్వానికి నిదర్శనమైన ప్రాచీన స్థలాలను సందర్శిస్తారని పేర్కొన్నారు. కమల్‌చంద్ర భంజ్‌దేవ్‌ను కలవాలనుకునే వారి కోసం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉదయం 10గంటలకు 'మీట్ అండ్ గ్రీట్' ఉంటుందని నవ్య, దివ్య, భవ్య టార్చ్ సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



బయ్యారం మండలం కొత్తపేట కొనుగోలు కేంద్రంలో వడ్లపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

# ధాన్యం అమ్మిన డబ్బు లేవీ?

- పది వేల మంది రైతుల ఎదురుచూపులు
- రేపు, మాపు అంటూ కాలం వెల్లదీస్తున్న అధికారులు
- వడ్లు తెచ్చిన కాడ్నుంచి పైసలొచ్చేదాకా అన్నదాతల అరిగోస

*అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా రైతులకు కష్టాలు తప్పడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రోజులు గడుస్తున్నా కాంటాలు వేయడం లేదు. మిల్లులకు తరలించడం లేదు. అకాల వర్షాలకు ధాన్యం తడవడం, ఆరబెట్టడం ఇదే తంతు సాగింది. చివరికి అష్టకష్టాలు పడి వడ్లు అమ్మగానే ఆ డబ్బుల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా పది వేల మంది రైతులు పైసలొప్పడొస్తా యా అని నిరీక్షిస్తున్నారు. అధికారులు మాత్రం రేపు, మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారు. వడ్లు తెచ్చిన కాడ్నుంచి పైసలు చేతుల పడేదాక అన్నదాతలు అరిగోస పడుతున్నారు.*

**- మహబూబాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ)**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేయడం లేదు. కొన్ని చోట్ల వేసినా మిల్లులకు తరలించడం లేదు. అకాల వర్షాలు, వడగండ్ల వానతో ధాన్యం తడిస్తే తిరిగి తేమ శాతం పేరుతో కొనడం లేదు. తిరిగి ధాన్యాన్ని ఆరబెట్టి కాంటాకు వచ్చేసరికి మళ్లీ పది రోజులు పడుతున్నది. గోనె సంచులు సైతం అందుబాటులో లేవు. ఇక తరుగు పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 239 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ధాన్యం సేకరణ పూర్తికాకముందే 74 సెంటర్లను మూసివేశారు. దీంతో రైతులు పక్క ఊరిలో ఉన్న కొనుగోలు కేంద్రానికి వెళ్లి ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 26,843 మంది రైతుల నుంచి 1,32,076 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 1, 04,626 మెట్రిక్ టన్నులు సన్నది కాగా, 27,450 మెట్రిక్ టన్నులదొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 26,843 మంది రైతులకు ఇప్పటివరకు 16,000 మందికి డబ్బులు చెల్లించారు. మిగిలిన 10,000 మందికి పైగా రైతులు ధాన్యం అమ్మిన డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం అమ్మిన తర్వాత 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు చెల్లించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకున్న నాధుడే లేరు. సుమారు 10,000 మంది రైతులకు గాను రూ. 85 కోట్లకు పైగా ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. రైతులు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముదామంటే అడ్డుకి పావు షేరు చొప్పున అడుగుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు మద్దతు ధర ఇవ్వకపోవడంతో చేసేది లేక ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయి స్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న అధికారులు రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడం లేదు. పౌరసరఫరాల సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు పది రోజులకు గానీ డబ్బులు పడడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సకాలంలో ఖాతాల్లో డబ్బులు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.



కాళేశ్వర క్షేత్రంలో పార్కింగ్ చేసిన వాహనాలు





పుష్కర స్నానం చేస్తున్న యువతులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

# భక్తజన సందోహం

- సరస్వతీ పుష్కరాలకు కొనసాగుతున్న రద్దీ
- ఐదో రోజూ అదే తీరు.. సౌకర్యాలు లేక ఇబ్బందులు
- వీఐపీ సేవలో అధికారులు, పోలీసులు
- పుష్కర స్నానం చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రముఖులు

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 19 : సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తజనంతో కాళేశ్వరం కిటకిటలాడుతోంది. ఐదో రోజు సోమవారం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ ప్రాంతాల చెందిన లక్షకు పైగా భక్తులు త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేశారు. మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రూనాయక్ పుణ్యస్నానం చేసి కాళేశ్వర-ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నది ఒడ్డున పలువురు పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. సరస్వతీ మాతను దర్శించుకొని పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. వీఐపీ ఘాట్ నుంచి త్రివేణి సంగమానికి ఇసుకపై తగినన్ని క్యార్పెట్



ఆలయ ఆవరణలో పందిళ్లు లేక ఎండలో అల్లాడుతున్న భక్తులు

మ్యాట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. పోలీస్‌లు, అధికారులు వీఐపీల సేవలో తరిస్తూ సామాన్యులను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఐపీ ఘాట్ వద్ద పలువురు పోలీసులు భక్తులపై దురుసుగా ప్రవర్తించి చేయిచేసుకోవడం చర్చనీయాంశమైంది.

#### ఏర్పాట్లు ఏం బాగాలేవు



పుష్కరాల ఏర్పాట్లు బాగా లేవు. ఇక్కడ సామాన్య భక్తులను పట్టించుకోవడం లేదు. ఆలయ ఆవరణలో సీసీపై మ్యాట్‌లు వేయకపోవడం వల్ల ఎండ వేడికి కాళ్లు మండుతున్నాయి. చిన్న పిల్లలు, పెద్దవాళ్లు ఎలా తట్టుకుంటారు. ఏర్పాట్లు ఇంత దారుణంగా ఉంటాయనుకోలేదు. *– మాధురి, ఖమ్మం*

#### సామాన్యులను పట్టించుకుంటలేరు..



పుష్కరాలకు వచ్చే సామాన్య భక్తులను అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. వేసవి దృష్ట్యా తగిన ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. భక్తులతో పోలీసులు దురుసుగా ప్రవర్తించడం సరికాదు. అధికారుల సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

*– అరవింద్, బసంత్‌నగర్, పెద్దపల్లి జిల్లా*

## అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ ఆలయాలపై లేదు

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీపై ఉన్న శ్రద్ధ.. ఆలయాల అభివృద్ధిపై లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం కాళేశ్వరానికి వచ్చిన సంజయ్ దంపతులు పుణ్య స్నానాలు ఆచరించి నదీమాతకు పూజలు చేశారు. స్వామివారి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుష్కరాలకు ప్రభుత్వం రూ.35 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఆ నిధులు ఎటు సరిపోవన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధికి కోట్లాది రూపాయలు ప్రకటించి తక్షణమే విడుదల చేశారని గుర్తు చేశారు. ఇటీవల కాళేశ్వరానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రూ.200 కోట్లు ప్రకటించారని, ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

### దర్శనం త్వరగా అయ్యేలా చూడాలి : కలెక్టర్ రాహుల్ శర్మ

భక్తులు త్వరగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సరస్వతీ ఘాట్, సమాచార కేంద్రంతో పాటు ఆలయాన్ని సందర్శించారు. ఘాట్ల వద్ద వ్యర్థాలను తొలగించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



క్యూలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



పాకాలలో ఏర్పాటు చేసిన ట్రాంపోలిన్

# పాకాలలో చిల్డ్రన్స్ పార్క్

- రూ.5 లక్షలతో ఆట వస్తువుల ఏర్పాటు
- పెరగనున్న పర్యాటకుల తాడికి

ఖానాపురం, మే 19 : పర్యాటక ప్రాంతమైన పాకాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ పార్కు రూపుదిద్దుకుంటున్నది. పాకాల తుంగబంధం తూము దిగువ ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో పార్కు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి నిత్యం పాకాల అందాలను వీక్షించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. అందులో భాగంగా పర్యాటకుల పిల్లలు ఆటలాడుకోవడానికి పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్ తెలిపారు. ఇప్పటికే పాకాలలో బోటింగ్ ఏర్పాటు చేశారు. తాజాగా అటవీ శాఖ నిధులు రూ.5 లక్షలు వెచ్చించి చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పార్కులో గైరో, ట్రాంఫోలిన్, టైర్‌నెట్, బర్మా బ్రిడ్జి, స్పైడర్ వెబ్, టైర్‌వాక్, ఉయ్యాలలు, బెంచీలు ఏర్పాటు చేశారు. పనులు దాదాపు పూర్తవడంతో ఆటవస్తువులకు ట్రయల్స్ చేస్తున్నారు. గైరోకు రూ.60, ట్రాంఫోలిన్‌కు రూ.20, మిగితా అన్నింటికి కలిపి రూ.50గా రేటు నిర్ణయించారు. చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటుతో పాకాల మరింత శోభను సంతరించుకోనుండగా పర్యాటకుల సంఖ్య మరింత పెరగనున్నది.



టైర్‌వాక్



కైరో ఆటవస్తువు ట్రయల్స్‌ను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో రవికిరణ్